సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 7 । జూలై । 2023



సంఘాన్ని బలోపేతం చేద్దాం

సంఘాన్ని బలోపేతం చేసుకుందామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య కోరారు. - 8లో



సభ విజయవంతం చేయండి

వరంగల్‌లో ఈ నెల 8న నిర్వహించే మోదీ సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ నర్సయ్య గౌడ్ కోరారు. - 8లో

గరిష్టం/కనిష్టం 29° / 25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన కల్పించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు, అధికారులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఫోర్టిఫైడ్ రైస్ బలవర్ధక బియ్యమని ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ యస్.మోహన్‌రావు రేషన్ డీలర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో రేషన్ డీలర్స్‌తో ఫోర్టిఫైడ్ రైస్‌పై సమావేశం నిర్వహించారు. ఈ నెల నుంచి జిల్లాలో ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి క్వింటా బియ్యానికి కిలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నెల్స్ ప్రత్యేక యంత్రాల ద్వారా కలుపుతారన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎస్‌ఓ కిషోర్‌కుమార్, డీఎం రాంపతి, ఏఎస్‌ఓ పుల్లయ్య, డీటీ రాజశేఖర్, రేషన్ డీలర్స్ అధ్యక్షుడు నాగరాజు, డీలర్లు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం విడుదల

సూర్యాపేట : జిల్లాలో గత యాసంగిలో అకాల వర్షాలకు పంటలను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం నిధులను విడుదల చేసింది. మార్చి 22వ తేదీ నుంచి ఏప్రిల్ 27 వరకు జిల్లాలో వడగళ్లు కురిశాయి. ఈ వర్షాలకు కోతదశలో ఉన్న పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. పంటలను కోల్పోయిన రైతులు, కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎకరానికి రూ.10వేల చొప్పున అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించింది. ఇందులో జిల్లాలో 10,188 మంది రైతులకు చెందిన 11,508.22 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు తేలింది. నష్ట పరిహారం కింద రాష్ట్ర ప్రభుత్వ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) నుంచి జిల్లా రైతాంగానికి రూ.11,50,85,500లను విడుదల చేసింది.

క్రీడా కప్ పేరుతో ఎన్నికల తాయిలాలు

భానుపురి (సూర్యాపేట) : మంత్రి జగదీష్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని క్రీడా కప్ పేరుతో ఆయన అనుచరులు గ్రామాల్లో హడావుడి చేస్తూ ఎన్నికల తాయిలాలకు తెరలేపారని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ ఆరోపించారు. గురువారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో బధన్ నాయక్, గట్ల రమాశంకర్, మాంద్ర మల్లయ్యయాదవ్, నారబోయిన కిరణ్ కుమార్, కంబాలపల్లి శ్రీనివాస్, బొడ్డు శంకర్ గౌడ్, రఫీ, మన్సూర్, అత్‌హర్ పాల్గొన్నారు.

పర్యవేక్షణ లోపం వల్లనే నకిలీ విత్తనాల విక్రయాలు

హుజూర్‌నగర్: వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే మార్కెట్‌లో నకిలీ విత్తనాల అమ్మకాలు జరుగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ ఆరోపించారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రభాకర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుండు వెంకటేశ్వర్లు, జక్కుల రమేష్, పి. వాసుదేవ రావు, బంటు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీస్ పహారాలో షాపుల తొలగింపు



నేరేడుచర్లలోని జాన్‌పహాడ్ రోడ్డులో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురువారం పోలీస్ పహారాలో వివిధ షాపులు, గృహాలను తొలగించారు. 50 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసి అధికారులు, కాంట్రాక్టర్లు 6 జేసీబీలతో తొలగించారు. పనులను ఎవరు కూడా అడ్డుకోకపోవడంతోసాఫీగా సాగాయి. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీల నిర్మాణం, ఫుట్‌పాత్, సెంట్రల్ లైటింగ్ వంటి పనులను చేపట్టనున్నారు. గతంలో రామాపురం, పాత నేరేడుచర్లలో రోడ్డుకు ఇరువైపులా 20 అడుగుల మేర తొలగించారు.

ఇదీ.. చివ్వెంల మండలం పిల్లల జగ్గుతండా ప్రాథమిక పాఠశాల. ఇక్కడ ఎనిమిది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తండాలో గురువారం పండుగ ఉండడంతో ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీంతో ఉపాధ్యాయురాలు ఇలా ఖాళీగా కూర్చున్నారు.



ఇదీ.. తిరుమలగిరి మండలం లాక్యతండాలోని ప్రాథమిక పాఠశాల. ఇందులో మొత్తం ఏడుగురు విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ ఒక ఉపాధ్యాయుడు పనిచేస్తున్నారు. గ్రామంలో బంధువు చనిపోవడంతో గురువారం ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉన్న ఒక్క విద్యార్థికి ఉపాధ్యాయుడు ఇలా పాఠాలు బోధించారు.



మూత బడి ఉన్న ఈ ప్రాథమిక పాఠశాల చిలుకూరు మండలంలోని కొమ్ముబండ తండాలోనిది. ఈ స్కూల్‌లో గత సంవత్సరం ముగ్గురు విద్యార్థులు ఉండేవారు. ఒక ఉపాధ్యాయుడు కూడా పనిచేసేవారు. ఇంగ్లిష్‌మీడియం లేదన్న కారణంతో ఆ ముగ్గురు విద్యార్థులు ఈ సంవత్సరం ప్రైవేట్ పాఠశాలకు వెళ్లారు. ఉపాధ్యాయుడు బడి బాటలో భాగంగా ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించినా ఈ విద్యా సంవత్సరం ఎవరూ చేరలేదు. దీంతో అతడిని నారాయణపురం స్కూల్‌కు డిప్యుటేషన్‌పై పంపించగా ఈ పాఠశాల మూతబడింది.



విద్యార్థులు వస్తలేరు!

ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది కంటే 6వేలు తగ్గిన ప్రవేశాలు

- బడిబాట నిర్వహించినా ఫలితం శూన్యం
- ఇంగ్లిష్ మీడియంపై మోజు, వసతుల లేమితో ఆసక్తి చూపని తల్లిదండ్రులు
- పది మంది విద్యార్థులు లోపు ఉన్న ప్రాథమిక పాఠశాలలు 122
- విద్యార్థులు లేక మూతబడిన స్కూళ్లు 62



విద్యార్థులు లేక మూతబడిన నడిగూడెం మండలం కర్విరాల జెడ్పీ ఉన్నత పాఠశాల



పుప్పాలగూడెం ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

సూర్యాపేట/సూర్యాపేటటౌన్ : 'విద్యార్థులు లేక మూత బడి ఉన్న స్కూళ్లు.. ఉన్న ఒక్క విద్యార్థికి పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు.. పిల్లలు రాక ఖాళీగా కూర్చున్న ఉపాధ్యాయుడు'.. ఇవీ సర్కారు స్కూళ్లలో గురువారం కన్పించిన దృశ్యాలు. జిల్లాలోని ప్రభుత్వ బడుల పరిస్థితులపై క్షేత్రస్థాయిలో సాక్షి విజిట్ నిర్వహించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం ఇస్తున్నా సర్కారు స్కూళ్ల వైపు మొగ్గు చూడడంలేదు. బడిబాట నిర్వహించినా, మన ఊరు మన బడి కార్యక్రమాలు చేపడుతున్నా ప్రయోజనం కన్పించడంలేదు. ప్రధానంగా ఇంగ్లిష్ మీడియంపై మోజు, స్కూళ్లలో మౌలిక వసతుల లేమి, ఉపాధ్యాయుల కొరత తదితర కారణాలతో విద్యార్థుల సంఖ్యతగ్గిపోతోంది. గత ఏడాది కంటే ఈ సారి 6వేల మంది విద్యార్థులు తగ్గారు.

మూడేళ్లలో బడిబాటలో చేరిన విద్యార్థులు		సర్కారు స్కూళ్లలో
సంవత్సరం	విద్యార్థులు	మొత్తం విద్యార్థులు
2021-22	3,800	80,000
2022-23	3,500	76,000
2023-24	2,900	70,000

950 ప్రభుత్వ పాఠశాలలు..

జిల్లాలో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు 950 ఉన్నాయి. వీటిలో సుమారు 70వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీటిలో పది మంది లోపు పిల్లలున్న ప్రాథమిక పాఠశాలలు 122, 30 మంది లోపు ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలు 10, విద్యార్థులు లేక మూతబడిన స్కూళ్లు 62 ఉన్నాయి.

ఉపాధ్యాయుల సర్దుబాటు ఏదీ?

విద్యార్థులు లేకుండా ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి అధికంగా పిల్లలున్న స్కూళ్లకు టీచర్లను సర్దుబాటు చేయాల్సి ఉంది. కానీ బడులు ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా ఒకటి రెండు చోట్ల తప్ప జిల్లా వ్యాప్తంగా ఇంకా సర్దుబాటు చేయకపోవడం గమనార్హం.

వివిధ మండలాల్లో పాఠశాలల పరిస్థితి ఇలా..

- ఆత్మకూర్.ఎస్ మండలంలోని పుప్పాలగూడెం ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. కృష్ణసముద్రం, అస్లాతండా, జగినితండా, భోజగానితండాల్లో ఒక్క విద్యార్థి లేడు. మిడ్తనపల్లిలో ఆరుగురు, లక్ష్మతండాలో తొమ్మిది, పొట్టిసూర్యతండాలో పది, మిడ్తనపల్లి హై స్కూల్‌లో పది మంది విద్యార్థులు ఉన్నారు.
- చివ్వెంల మండలంలోని జగననాయక్‌తండా, జయరాంగుడితండా, కర్విగారం, మొగ్గయ్యగూడెం, పాండునాయక్‌తండా, రాజుతండా పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేరు. బానోత్యతండా, గుడితండాలో ఏడుగురు చొప్పున ఉండగా హలావత్‌తండా, పిల్లలజగ్గుతండాలో ఎనిమిది మంది చొప్పున విద్యార్థులు ఉన్నారు.
- తుంగతుర్తి మండలంలో కేశవపురం, చాకలిగూడెం, చౌళ్లతండా, వెంపటి ఎస్సీ కాలనీ, బండరామారంలో విద్యార్థులులేరు. మొండికుంటతండాలో నలుగురు, జేత్యాతండాలో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. వెంపటి ప్రాథమిక పాఠశాలలో 289 విద్యార్థులు ఉన్నారు.
- జాజిరెడ్డిగూడెం మండలంలోని తుంగగూడెంలో ఐదుగురు, తూర్పుతండాలో ఎనిమిది మంది, పడమటితండాలో ఎనిమిది, వీర్యనాయక్‌తండాలో ఆరుగురు, గన్యనాయక్‌తండాలో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. కొత్తగూడెం, కుమ్మరిగూడెం పాఠశాలల్లో విద్యార్థులు లేక మూసివేశారు.
- తిరుమలగిరి మండలంలోని జేత్యతండాలో ఆరుగురు, వేములతండాలో మూడు, లక్యాతండాలో ఏడు, టీక్యాతండాలో మూడు, దుబ్బతండాలో ఆరు, భూక్యతండాలో ఆరు, మర్రికుంట తండాలో ముగ్గురు విద్యార్థులు ఉన్నారు.
- నేరేడుచర్ల మండలంలో విద్యార్థులు లేక మూడు పాఠశాలలు మూసివేయగా జగనతండా, మూసిఒడ్డుతండా, ఎల్లారం, రోళ్లవారిగూడెంలో పది మంది లోపు విద్యార్థులు ఉన్నారు.
- మేళ్లచెర్వు మండలం దుబ్బతండాలో ఎనిమిది, గాంధీనగర్‌లో ఆరుగురు, హేమ్లాతండాలో 196 మంది విద్యార్థులు ఉన్నారు.గరిడేపల్లి మండలంలోని మర్రికుంటలో నలుగురు విద్యార్థులు ఉన్నారు. మఠంపల్లి మండలంలో విద్యార్థులు లేక ఏడు పాఠశాలలు మూతపడ్డాయి.
- కోదాడ, తిరుమలగిరి, నూతనకల్, అర్వపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 500 మందికి పైగా విద్యార్థులు, మరికొన్ని పాఠశాలల్లో 200 మంది విద్యార్థులు ఉన్నారు. నడిగూడెం మండలం కర్విరాల జెడ్పీ ఉన్నత పాఠశాల మూతపడింది.

వసతులు లేక ప్రైవేట్ పాఠశాలకు పంపుతున్నా



ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు సరిగా ఉండటం లేదు. మూత్రశాలలు, మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. తాగునీటి సమస్య ఉంది. మధ్యాహ్న భోజనం సరిగా పెట్టడం లేదు. ఉపాధ్యాయుల కొరత, పుస్తకాలు సరైన సమయంలో ఇవ్వడం లేదు. అందువల్ల నా ఇద్దరు పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపుతున్నా.

– వీరబోయిన సైదులు, విద్యార్థి తండ్రి, చివ్వెంల

ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేశాం



జిల్లాలోని ఆయా మండలాల్లో తక్కువ విద్యార్థులు ఉండి ఎక్కువ ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలను గుర్తించి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఇప్పటికే ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులు తక్కువగా ఉండి ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉంటే పక్క పాఠశాలలకు సర్దుబాటు చేస్తాం. ఈ నెల చివరి వరకు ప్రక్రియ పూర్తవుతుంది.

– అశోక్, డీఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

'మన ఊరు మన బడి' పనులు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : మన ఊరు మనబడి కింద పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ ఆదేశించారు. మన ఊరు మన బడిపై గురువారం కలెక్టరేట్‌లో ఎంఈఓలు, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మన ఊరు మన బడి కింద చేపట్టిన 329 స్కూళ్లకు గాను 325 పాఠశాలకు అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ రాగా వీటిలో చింతల పాలెం మండలంలో-1, చివ్వెంల-1, నాగారం-2, పెన్‌పహాడ్-1, సూర్యాపేట-6, తిరుమలగిరి-1 మొత్తం 12 స్కూళ్లలో వివిధ కారణాలవల్ల పనులు మొదలు కాలేదన్నారు. 22 స్కూళ్లను ప్రారంభోత్సవం చేసుకున్నామని 20 పాఠశాలలు ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఈనెలాఖరుకల్లా పనులు పూర్తికానున్న పాఠశాలల వివరాలను మండలాల వారిగా అడిగి తెలుసుకున్నారు. సెప్టెంబర్ నెలాఖరు వరకు అన్ని పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈఓ అశోక్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలకు వేదిక



ప్రాజెక్టును తిలకిస్తున్న అధికారులు(ఫైల్)



ఇంటింటా ఇన్నోవేటర్ పై ప్రభుత్వం రూపొందించిన చిత్రం

- ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం
- ఆగస్టు 5 వరకు విద్యార్థులనుంచి దరఖాస్తుల ఆహ్వానం
- స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రాజెక్టుల ప్రదర్శన
- రాష్ట్ర స్థాయి విజేతకు రూ.లక్ష బహుమతి

చిలుకూరు: విద్యార్థులు, యువతలో దాగి ఉన్న కొత్త ఆలోచనలు , ఆవిష్కరణలను ప్రేరిపించేలా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. 2023-24 సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు.

వాట్సప్ ద్వారా దరఖాస్తులు

ఇంటింటా ఇన్నోవేటర్‌లో దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు సెల్‌ఫోన్‌లో ప్రాజెక్టును ప్రదర్శించాలి. ముందుగా తమ ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన ఏదైనా ప్రాజెక్టును వివరాలతో ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలి. తమ ఆవిష్కరణలకు సంబంధించిన ఆరు వ్యాఖ్యలు రెండు నిమిషాల వ్యవధితో ఉన్న వీడియో, ప్రాజెక్టుకు సంబంధించిన నాలుగు చిత్రాలు, ఆవిష్కర్త పేరు, ఫోన్ నంబర్ , ప్రస్తుత వృత్తి, గ్రామం, జిల్లా పేరు తదితర వివరాలను సెల్ నంబర్ 91006 78543కు వాట్సాస్ ద్వారా పంపించాలి. వీటిని రాష్ట్ర ఇన్నోవేషన్ విభాగంవారు పరిశీలించి జిల్లా నుంచి ఐదు ఆవిష్కరణలను ఎంపిక చేస్తుంది.

విజేతకు లక్ష రూపాయల బహుమతి

ఎంపిక చేసిన ఐదు ఆవిష్కరణలను స్వాతంత్ర్య దినోత్సవం రోజున జిల్లాలో వచ్చిన వాటిలో ఉత్తమ మైనది ఎంపిక చేసి ఆన్‌లైన్ ద్వారా ప్రదర్శిస్తారు. ఇందులో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలతో పాటు అవార్డులను అందజేస్తారు. రాష్ట్ర స్థాయి విజేతకు రూ. లక్ష వరకు నగదు బహుమతి ఉంటుంది. ప్రతి పాఠశాల నుంచి ఒక ఆవిష్కరణ పంపించేలా హెచ్‌ఎంలు చొరవ చూపాలి.

ప్రతిభను వెలికి తీసేందుకే..



విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఆసక్తి గల గల వారు దరఖాస్తు చేసుకొని ప్రతిభ కనబరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లభిస్తుంది.

– ఎల్. దేవరాజ్, జిల్లా సైన్స్ అధికారి

పక్కాగా రేషన్ బియ్యం లెక్క !

- ఎట్టకేలకు డీలర్లకు బయోమెట్రిక్ విధానం
- ఈనెల నుంచే అమలు
- తీరనున్న తరుగు కష్టాలు



బయోమెట్రిక్ యంత్రం

నాగారం : ఇక నుంచి రేషన్ డీలర్లకు తరుగు కష్టాలు తీరనున్నాయి. ఈ నెల నుంచే రేషన్ డీలర్లకు బయోమెట్రిక్ ద్వారా బియ్యం కేటాయించేలా చర్యలు చేపట్టారు. అయిదు నెలల క్రితమే ఈ విధానాన్ని అమలు చేయాలని భావించినా సాంకేతిక సమస్యతో జాప్యం జరిగింది. ఎట్టకేలకు బయోమెట్రిక్ అమలుతో జిల్లాలోని రేషన్ డీలర్లు ప్రతినెలా మండల స్థాయి గోదాములకు వెళ్లి తమ దుకాణంలోని కార్డుల ఆధారంగా కచ్చితమైన తూకంతో బియ్యం తీసుకోవాల్సి ఉంటుంది.

గన్నీసంచి తిరకాసుతో ఆలస్యం..

జిల్లాలోని 23 మండలాల పరిధిలో 610 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆహార భద్రత కార్డులు 3,05,624, అంత్యోదయ కార్డులు 19,868, అన్నపూర్ణ కార్డులు 40 ఇలా మొత్తం 3,25,471 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 9,48, 283యూనిట్లు నమోదై ఉన్నాయి. కాగా కేంద్ర ప్రభుత్వ కోటా కింద 5 కిలోలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా కిలో.. ఇలా ప్రతీ యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున పంపిణీ చేసేలా ఈ నెలలో 4700 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు. కానీ 600 గ్రాములు ఉండే గన్నీ బ్యాగు బరువు తీయకుండానే బియ్యం ఇస్తే తాము నష్టపోతామని డీలర్లు చెబుతున్నారు. అందుకే ప్రతి నెలా 26 నుంచి గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా కావాల్సి ఉండగా జిల్లాలోని చాలా మంది డీలర్లు మంగళవారం వరకు తీసుకోలేదు. గన్నీ బ్యాగు బరువు తీసి బియ్యం ఇవ్వాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించారు. దీంతో బుధవారం నుంచి డీలర్లు బియ్యం తీసుకుంటున్నారు. ప్రతినెలా 5 నుంచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల నుంచి బయోమెట్రిక్ విధానం అమలు చేస్తుండటంతో ఇకపై ప్రతినెలా 7 నుంచి బియ్యం పంపిణీ ప్రారంభించాలని పౌరసరఫరాల శాఖ ఆదేశించింది.

కచ్చితమైన తూకంతో బియ్యం సరఫరా



ఈనెల నుంచి ప్రతి డీలర్‌కు బయోమెట్రిక్ ద్వారానే బియ్యం ఇచ్చేలా ఏర్పాట్లు చేశాం. గతంలో బియ్యం తరుగు వస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చేవి. ఇక నుంచి అలాంటి సమస్య ఉండదు. కార్డులు, యూనిట్ల ఆధారంగా ఎంఎల్‌ఎస్ పాయింట్ల ద్వారా కచ్చితమైన తూకంతో డీలర్లకు బియ్యం సరఫరా అవుతాయి.

– బి.రాంపతి, పౌరసరఫరాల శాఖ డీఎం, సూర్యాపేట.

తీరనున్న తరుగు కష్టాలు..

జిల్లాలోని 4 ఎంఎల్‌ఎస్ పాయింట్‌ల నుంచి 610 రేషన్ దుకాణాలకు నెలనెలా బియ్యం సరఫరా అవుతున్నాయి. ఒక్కో బస్తాలో 50 కిలోల బియ్యం ఉంటుందని స్టాక్ పాయింట్ అధికారులు చెబుతుండగా.. దుకాణాలకు వచ్చేసరికి నాలుగైదు కిలోలు త గ్గుతున్నాయని డీలర్లు పేర్కొంటున్నారు. బియ్యం తక్కువ వస్తున్న విషయాన్ని డీలర్లు పౌరసరఫరాలశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమీక్షించిన కమిషనర్ గత ఫిబ్రవరి నుంచి బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రయోగాత్మకంగా మండలానికి అయిదారుగురు డీలర్లకు బయోమెట్రిక్ విధానంతో బి య్యం ఇవ్వాలని ప్రయత్నించినా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నిలిపివేశారు. ఈ సమస్యను సవరించి ఈ నెల నుంచే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో ఎంఎల్ ఎస్ పాయింట్ వద్ద డీ లర్ల వేలి ముద్రలతో బియ్యం అందజేయనున్నారు.

సీఐల బదిలీ

సూర్యాపేట క్రైం: జిల్లాలో పని చేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ గురువారం హైదారాబాద్ వెస్ట్‌జోన్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట రూరల్ సీఐగా పని చేస్తున్న సోమ్ నారాయణసింగ్‌ను డీజీ కార్యాలయానికి, చండూర్‌లో పని చేస్తున్న వెలమ అశోక్‌ను సూర్యాపేట రూరల్‌కు, డీసీఆర్‌లో ఉన్న సీఐ శివశంకర్‌ను నాగారం మండలానికి, అక్కడ పని చేస్తున్న సీఐ రాజేష్‌ను డీసీఆర్బీకి, తుంగతుర్తి సీఐ నాగార్జునగౌడ్‌ను డీఎస్‌బీకి బదిలీ చేశారు. వీరు ఒకటి రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

నలుగురు ఎస్‌ఐలు..

జిల్లాలో పని చేస్తున్న పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పీసీఆర్‌లో పని చేస్తున్న హరికృష్ణను హుజూర్‌నగర్‌కు, హుజూర్‌నగర్‌లో పనిచేస్తున్న వెంకట్‌రెడ్డిని పీసీఆర్‌కు, నల్లగొండ వీఆర్‌లో ఉన్న హరీష్‌రెడ్డిని చింతలపాలెం, చింతలపాలెంలో పని చేస్తున్న ఎస్ఐ కృష్ణారెడ్డిని వీఆర్ నల్లగొండకు బదిలీ చేశారు.

ప్రతిపాదనను వెనక్కి తీసుకోకుంటే సమ్మె చేస్తాం



సూర్యాపేటలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

భానుపురి (సూర్యాపేట) : నల్లగొండ డీలక్స్ సర్వీస్‌లను స్పెషల్ ఆఫ్ సర్వీస్‌గా నడపాలని, రెండురోజులు 12నుంచి 14గంటల పాటు డ్యూటీ చేస్తే 3వ రోజు సెలవు ఇస్తామని యాజమాన్యం చేసిన ప్రతిపాదననూ వెనక్కి తీసుకోకపోతే సమ్మె చేస్తామని డిపో జాయింట్ యాక్షన్ కమిటీ, వెల్ఫేర్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. యాజమాన్య .. కార్మిక వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ గురువారం సూర్యాపేట డిపో గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగామ, ఖమ్మం, నల్లగొండ తదితర డ్యూటీలను వరుసగా రెండు రోజులు రెండు డ్యూటీలు చేస్తే 3వ రోజు సెలవు (స్పెషల్ ఆఫ్) ఇస్తామని యాజమాన్యం డ్యూటీ చార్ట్ వేసిందని, ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కార్మికుల సంతకాలతో వినతిపత్రాన్ని డిపో మేనేజర్‌కు అందించినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, అంజయ్య, బత్తుల సుధాకర్, పీఎంరావు, సేవ్య, భానునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర వెంకన్న, తుల్లా రాములు, యాకస్వామి, డీఎస్‌రావు, నరేష్, ఎల్లయ్య, పరశురాములు, శ్రీను, దామోదర్ పాల్గొన్నారు.

- పంచాయతీ కార్మికుల సమ్మె



రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

కనగల్: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన ఘటన కనగల్ మండల పరిధిలోని శాబ్దుల్లాపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. శాబ్దుల్లాపురం గ్రామానికి చెందిన కోల వెంకన్న, ముత్తమ్మ దంపతుల మొదటి కుమారుడు కోల గోపి(20) గ్రామంలోని కిరాణ దుకాణానికి వెళ్లి నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా రోడ్డు పక్కన స్తంభానికి ఉన్న విద్యుత్ తీగలు తెగి అతడి మీద పడ్డాయి. దీంతో అతడు విద్యుదాఘాతానికి గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. పక్కనే వెళ్తున్న రైతు అశోక్ గమనించి కర్ర సహాయంతో విద్యుత్ తీగలను తొలగింపజేశాడు. చుట్టుపక్కల వారి సహాయంతో 108 వాహనంలో గోపిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. గోపి తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కనగల్ పోలీసులు తెలిపారు.

పవర్ ప్లాంట్‌లో చోరీ

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో యంత్రాలకు అమర్చే సుమారు రూ.98వేల విలువైన బేరింగ్‌లను చోరీ చేసిన నిందితులను గురువారం దామరచర్ల మండల కేంద్రం శివారులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2వ తేదీన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పనులు చేస్తున్న ఆల్ఫా పవర్ ఇంజనీరింగ్ సర్వీస్ లిమిటెడ్‌కు చెందిన 6 లైన్ షాఫ్ట్ ఇత్తడి బేరింగ్‌లు చోరీ గురయ్యాయి. దీంతో సంస్థకు చెందిన వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసకొని విచారణ చేపట్టిన పోలీసులు గురువారం దామరచర్ల శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా మిర్యాలగూడ వైపు వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా చోరీకి గురైన మెటీరియల్ ఉండడంతో అందులో ప్రయాణిస్తున్న పయ్యావుల సైదారావు, తురక రమేష్, క్రాంతి, చెన్నబోయిన శ్యామ్‌ను అదుపులోకి తీసుకోని విచారించగా నిజం అంగీకరించారు. దీంతో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అసభ్య పదజాలంతో దూషించాడని హత్య

- వీడిన అల్వాలపహాడ్ వాసి మర్డర్ మిస్టరీ
- ఇద్దరు నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన హాలియా సీఐ గాంధీనాయక్



వివరాలు వెల్లడిస్తున్న హాలియా సీఐ గాంధీ నాయక్, వెనుక నిందితులు

త్రిపురారం: జనం అందరి ముందు తనను అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిపై కక్ష పెంచుకొని కత్తితో పొడిచి హత్య చేసిన నిందితులను పోలీసులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శోభన్‌బాబుతో కలిసి హాలియా సీఐ గాంధీనాయక్ విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలంలోని బి.అన్నారం గ్రామానికి చెందిన రాందేని శివ హాలియాలోని సోనాలిక ట్రాక్టర్ షోరూంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అంతేకాకుండా త్రిపురారం మండలానికి సేల్స్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ ప్రతి గ్రామానికి తిరుగుతూ సోనాలిక ట్రాక్టర్ల గురించి ప్రచారం చేస్తున్నాడు. జూన్ 29న బి.అన్నారం గ్రామానికే చెందిన తన మిత్రుడు పేరూరు శివతో కలిసి త్రిపురారం మండలంలోని అల్వాలపహాడ్ గ్రామానికి వెళ్లిన రాందేని శివ అక్కడ ట్రాక్టర్ యజయానులకు సోనాలిక ట్రాక్టర్ గురించి వివరిస్తున్నాడు. అదే సమయంలో అల్వాలపహాడ్ గ్రామానికే చెందిన బొలిగోర్ల వెంకన్న వారి వద్దకు వచ్చి 'ముందు మాయమాటలు చెప్పి ట్రాక్టర్లు కొనేటట్లు చేస్తారు.. తర్వాత కిస్తీలు కట్టాలని ఇబ్బందులు పెడతారు' అని రాందేని శివ, పేరూర్ శివను అసభ్య పదజాలంతో దూషిస్తూ గొడవపడ్డాడు. దీంతో వెంకన్నపై కక్ష పెంచుకున్న రాందేని శివ ఎలాగైనా అతడిని చంపాలని నిర్ణయించుకున్నాడు. అదేరోజు ఏకాదశి పండుగ కావడంతో బొలిగోర్ల వెంకన్న తన బావమరిది రావుల కోటయ్యతో కలిసి బైక్‌పై అడవిదేవులపల్లి మండలంలోని సత్రశాలకు దైవదర్శనానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో త్రిపురారం మండలం చెన్నాయిపాలెం గ్రామ శివారులోని అల్వాలపహాడ్ ఎక్స్‌రోడ్ వద్దకు రాగానే రాందేని శివ, పేరూర్ శివ కలిసి బైక్‌పై వెనుక కూర్చొని ఉన్న బొలిగోర్ల వెంకన్న మెడ, ఛాతీ, వీపుపై పదునైన కత్తితో పొడిచి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు పారిపోయారు. గాయపడిన వెంకన్నను స్థానికులు ఆటోలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న త్రిపురారం పోలీసులు సీఐ గాంధీనాయక్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. కాగా బుధవారం నిందితులు రాందేని శివ, అతడి స్నేహితుడు పేరూర్ శివ గుంటూరు నుంచి తమ స్వగ్రామానికి వస్తుండగా ఎస్ఐ శోభన్‌బాబు తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకొని విచారించగా వెంకన్నను తామే హత్య చేసినట్లు నిజం ఒప్పుకున్నారు. దీంతో వారిద్దరిని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో వేగంగా స్పందించిన త్రిపురారం ఎస్ఐ శోభన్‌బాబు, ఏఎస్ఐ రామయ్య, ఇతర పోలీసు సిబ్బందిని సీఐ గాంధీ నాయక్ అభినందించారు.

రౌడీ షీటర్‌గా గుర్తించడంలేదని..?

రాందేని శివ తండ్రి కరోనా సమయంలో మరణించాడు. తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. రాందేని శివపై గతంలో రౌడీ షీట్ ఉన్నట్లు పోలీసుల ద్వారా తెలిసింది. తనను ఎవరూ గుర్తించడంలేదని, ఎలాగైనా ప్రజల్లో గుర్తింపు పొందాలనే ఉద్దేశంతోనే వెంకన్నను రాందేని శివ హత్య చేసినట్లుగా తెలుస్తోంది.

పోలీసులకు సమాచారం ఇవ్వాలి

యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా ఉండాలి. క్షణికావేశంలో చట్ట వ్యతిరేక పనులకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. మండలంలోని ప్రతి గ్రామంలో పోలీసు సిబ్బంది విస్తృతంగా పెట్రోలింగ్ చేసేలా చూస్తాం.

– గాంధీ నాయక్, సీఐ, హాలియా

క్రెడిట్ కార్డు ఇప్పిస్తామని మోసం

- యాప్ డౌన్‌లోడ్ పేరుతో రూ.1.34 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

నకిరేకల్: క్రెడిట్ కార్డు ఇప్పిస్తామని చెప్పి యాప్ డౌన్‌లోడ్ పేరుతో ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.34 లక్షలు కాజేశారు. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌కు చెందిన పోడిచెటి శ్రీనుకి గురువారం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ బ్యాంక్ ఖాతా నంబర్లకు క్రెడిట్ కార్డు ఎలిజిబులిటీ ఉందని చెప్పాడు. క్రెడిట్ కార్డు పొందాలంటే ముందుగా ఫోన్‌లో రస్క్ డెస్క్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమన్నాడు. ఆ తర్వాత మొబైల్‌కు వచ్చిన ఓటీపీ నంబర్ చెప్పమని అడిగాడు. శ్రీను సదరు వ్యక్తి ఫోన్‌లో చెప్పింది నమ్మి సెల్‌కు వచ్చిన ఓటీపీ నంబర్‌ను అతడికి చెప్పాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి ఫోన్ పెట్టేయగా, కొద్దిసేపటికే శ్రీనుకు గల హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ ఖాతాల నుంచి రూ.1.34 లక్షలు కట్ అయినట్లు మెసేజ్ రావడంతో బిత్తరపోయాడు. వెంటనే బ్యాంక్ ఖాతాలు చెక్ చేసుకోగా డబ్బులు కట్ అయినట్లు గ్రహించి నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌కు చేసి ఓటీపీ నంబర్లు అడిగితే చెప్పొద్దని ఎస్ఐ సూచించారు.

సహజీవనం చేస్తున్న మహిళ హత్య

- పరారీలో నిందితుడు



ఉప్పలమ్మ మృతదేహం

చివ్వెంల(సూర్యాపేట): తనతో సహజీవనం చేస్తున్న మహిళను పదునైన ఆయుధంతో కొట్టి హత్య చేశాడో వ్యక్తి. ఈ ఘటన చివ్వెంల మండలం కుడకుడ గ్రామ శివారులోని ఎన్టీఆర్ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామానికి చెందిన ఉప్పలమ్మ(35)కు చివ్వెంల మండల పరిధిలోని కోమటికుంట గ్రామానికి చెందిన గట్టు ఉప్పలయ్యతో 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు సంతానం. ఆరేళ్ల క్రితం ఉప్పలయ్య అనారోగ్యంతో మృతిచెందగా.. ఉప్పలమ్మ కేతేపల్లి మండలం కొర్లపహాడ్ గ్రామానికి చెందిన వ్యక్తితో సహజీవనం చేసి ఒక కుమార్తెకు జన్మనిచ్చింది. కొంతకాలం తర్వాత వీరి మధ్య మనస్పర్థలు రావడంతో విడిపోయారు. ఆ తర్వాత చివ్వెంల మండల పరిధిలోని గాయం వారిగూడెం ఆవాసం టీకంతండాకు చెందిన ధరావతు రవితో ఉప్పలమ్మ సహజీవనం చేస్తోంది. రవికి అంతకుముందే పెళ్లై భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవి, ఉప్పలమ్మ అంతకుముందు కుడకుడ గ్రామ శివారులోని ఎన్టీఆర్ కాలనీలో ఉంటుండగా, గత మూడు నెలల నుంచి సూర్యాపేట పట్టణంలోని శ్రీరాంనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. బుధవారం అర్ధరాత్రి తిరిగి కుడకుడ గ్రామ శివారులోని ఎన్టీఆర్ కాలనీకి వచ్చిన వీరిద్దరి మధ్య గొడవ జరగ్గా రవి పదునైన ఆయుధంతో ఉప్పలమ్మ తల, నుదుటిపై బలంగా కొట్టడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో రవి కుడకుడలోని పీఎస్ఆర్ టౌన్‌షిప్‌లో ఉంటున్న ఉప్పలమ్మ తల్లి లక్ష్మికి జరిగిన విషయం చెప్పి ఘటనా స్థలానికి తీసుకురాగా ఆమె కుమార్తెను చూసి బిగ్గరగా రోదించింది. దీంతో ఇరుగుపొరుగు వచ్చేసరికి రవి అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే వారు 100కు డయల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఉప్పలమ్మను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా, ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

మిర్యాలగూడ అర్బన్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ వన్ టౌన్ ఎస్ఐ శివతేజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం వసురాంతండాకు చెందిన ధనావత్ దివ్యభారతి, ఆమె భర్త మాన్యానాయక్ కలిసి బతుకుదెరువు నిమిత్తం మిర్యాలగూడ పట్టణానికి వచ్చి స్థానిక హౌజింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్నారు. కాగా జూన్ 12వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన దివ్యభారతి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం ఆమె భర్త మాన్యానాయక్ మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. దివ్యభారతి ఆచూకీ తెలిసిన 8712577241, 8712670149 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

అతివేగంగా వెళ్తూ కారు బోల్తా

- వాహనంలో గంజాయి ప్యాకెట్లు లభ్యం



ప్రమాదానికి గురైన కారు

చిట్యాల: అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తాకొట్టిన ఘటన చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి నలుగురు వ్యక్తులు స్విఫ్ట్ కారులో హైదరాబాద్ వైపునకు అతివేగంగా వెళ్తుండగా.. వెలిమినేడు గ్రామ శివారులోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి రహదారి పక్కన చెట్లను ఢీకొట్టి బోల్తా పడింది. స్థానికులు వెళ్లి చేసేసరికి కారులోని ముగ్గురు పరారవ్వగా.. హైదరాబాద్‌కు చెందిన గుంటి సాయివరుణ్ తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే పడిపోయాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి గురైన కారులో గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి చిట్యాల పోలీసులను సంప్రదించగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

బంధువులు అవమానించారని ఆత్మహత్య



ఘటనా స్థలంలో గోపాలకృష్ణ మృతదేహం

హుజూర్‌నగర్: బంధువులు అవమానించారని మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన తురక మట్టయ్యకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు తురక గోపాలకృష్ణ(32)కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన భవానితో 2019లో వివాహమైంది. వీరికి సంతానం లేదు. జూన్ 29న భవాని భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లింది. మరుసటి రోజు గోపాలకృష్ణ తన భార్యను తీసుకొని రావడానికి జగ్గయ్యపేట వెళ్లాడు. అక్కడ భవానీ మేనమామ దేశగాని వెంకటేష్, అతడి తల్లి అప్పమ్మ గోపాలకృష్ణను తిట్టి అవమానించారు. అనంతరం హుజూర్‌నగర్‌కు వచ్చిన గోపాలకృష్ణ మనస్తాపంతో గురువారం పట్టణ శివారులోని పోతిరేనికుంట కట్టపై గల వేప చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి మట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి గేదెలు మృతి



మృతిచెందిన గేదెలు

హుజూర్‌నగర్‌రూరల్: వ్యవసాయ భూమిలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి ఐదు పాడి గేదెలు మృతిచెందిన ఘటన హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బూరుగడ్డ గ్రామ శివారులోని ఓ రైతు వ్యవసాయ భూమిలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి చిలుకూరు మండలం సీతారాంతండాకు చెందిన గుగులోతు బోజ్యానాయక్ చెందిన 2 గేదెలు, గుగులోత్ రవీందర్‌నాయక్‌కు చెందిన 2 గేదెలు, గరిడేపల్లి మండలం కట్టవారిగూడెం గ్రామానికి చెందిన బాల్దూరి సత్యనారాయణకు చెందిన ఒక పాడి గేదె మృతిచెందాయి. మృతిచెందని గేదెల విలు రూ.2.50లక్షలు ఉంటాయని బాధిత రైతులు తెలిపారు.

ఐక్యంగా సంఘాన్ని బలోపేతం చేసుకుందాం


- విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య

కోదాడఅర్బన్: సభ్యులందరం ఐక్యంగా ఉండి సంఘాన్ని బలోపేతం చేసుకుందామని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య కోరారు. గురువారం కోదాడ విశ్రాంత ఉద్యోగుల సేవా సదన్‌లో విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి విశ్రాంత ఉద్యోగులు ఉద్యమించాలన్నారు. సంఘం కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి లక్ష్మీనర్సయ్య కార్యదర్శి నివేదిక చదివి వినిపించగా సభ్యులు తీర్మానించారు. సమావేశంలో సూర్యాపేట జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, జిల్లా యూనిట్ నాయకులు హమీద్‌ఖాన్, కోటమర్తి విద్యాసాగర్‌రావు, హుజూర్‌నగర్, నడిగూడెం మండల శాఖ అధ్యక్షులు సోమయ్య, ఎండీ ఖలీల్ అహ్మద్, ప్రతాపరెడ్డి, ఎంఎస్ఎన్ రాజు, జగన్మోహన్, హనుమారెడ్డి, సైదులు, వెంకటేశ్వరరావు, వరప్రసాద్ రావు, చంద్రయ్య, రఘు, గోపి, ఫక్రుద్దీన్, భిక్షం పాల్గొన్నారు.

పీవైఎల్ రాష్ట్ర కోశాధికారిగా ధరావత్ రవి ఎన్నిక



మునగాల(కోదాడ): ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర కోశాధికారిగా మునగాల మండలం కొక్కిరేణి గ్రామానికి చెందిన ధరావత్ రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 4,5వ తేదీల్లో ఖమ్మం జిల్లా ఇల్లందు పట్టణంలో నిర్వహించిన పీవైఎల్ రాష్ట్ర ఎనిమిదవ మహాసభలో తనను రాష్ట్ర కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన గురువారం తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్

నూతనకల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. గురువారం నూతనకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలల్లో మన ఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన డైనింగ్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా 200 అడ్మిషన్లు పూర్తయిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను గురువారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ చైర్మన్ తోటకూరి అనురాధబీరయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాల గురించి నేరుగా వారిని అడిగి తెలుసుకున్నారు. కిచెన్ షెడ్‌తోపాటు, వంటలు, వసతి గదులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమయ్యారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

- మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

తిరుమలగిరి (తుంగతుర్తి): వరంగల్ జిల్లాలో ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ కోరారు. గురువారం తిరుమలగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్‌లో రైల్వే మ్యానుఫ్యాక్చర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారని, ఈ యూనిట్‌తో వందలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అదేవిధంగా జాతీయ రహదారులకు వరంగల్, ఖమ్మం గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. త్వరలోనే మెగా టెక్స్‌టైల్ పార్కు, ట్రైబర్ యూనివర్సిటీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎస్ఆర్ఎస్పీ కాల్వల ద్వారా వచ్చేది జిల్లాకు వచ్చేది గోదావరి జలాలే అని, కాళేశ్వరం జలాలు కావన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, పేరాల పూలమ్మ, సాయిబాబా, మల్సూర్ గౌడ్, అయోధ్య, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, దీన్‌దయాళ్, వెంకట్‌రెడ్డి, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎవరికీ బీ టీమ్ కాదు

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్: బీఆర్ఎస్ ఎవరికీ బీ టీమ్ కాదని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో తుర్కపల్లి మండలం దయ్యాలబండ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వాళ్లు బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్ అని దుష్ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్‌కు బీజేపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో రూ.4000 పింఛన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి ఎంపీపీ భూక్యా రవీందర్ నాయక్, పిన్నపు నరేందర్ రెడ్డి, మాడోతు లక్ష్మా, సంతు, పాండు,రమేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, రాజనర్సయ్య, హరినాయక్, బాలరాజ్, నరేందర్ నాయక్, లక్ష్మణ్, మహేందర్, వెంకటేశ్, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

తొలకరిలో జీవాలకు చిటుక వ్యాధి ముప్పు

- ముందస్తుగా గుర్తించకపోతే చనిపోయే ప్రమాదం
- కోదాడ మండల పశువైద్యాధికారి నాగేంద్రబాబు





జీవాలకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి (ఫైల్)

పాడి పంట

కోదాడరూరల్: వర్షాకాలం ప్రారంభంలో కురిసే తొలకరి జల్లులతో జీవాలకు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. వర్షాలకు పచ్చిగడ్డి పెరుగుతుంది. ఈ గడ్డి జీవాలు తింటే ఎలాంటి రోగ లక్షణాలు కనిపించకుండానే చిటుక వ్యాధి(ఎంటరోటోక్సివియా) సోకి జీవాలు చనిపోయే ప్రమాదం ఉందని కోదాడ మండల పశువైద్యాధికారి నాగేంద్రబాబు అంటున్నారు. చిటుక వ్యాధిని ఆయా ప్రాంతాల్లో నెత్తిపిడుగు, గడ్డి రోగం వంటి పేర్లతో పిలుస్తుంటారని, జీవాలు ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించినప్పటికీ హఠాత్తుగా చనిపోతాయని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాధి లక్షణాలు, వ్యాధి సోకకుండా గొర్రెల కాపరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

చిటుక వ్యాధి వ్యాప్తి ఇలా..

క్లస్ట్రీడియం అనే సూక్ష్మజీవులు గాలి లేని(ఎనిరోబిక్) వాతావరణంలో వదలబడిన విష పదార్థాలు(టాక్సీన్లు) ఈ వ్యాధికి కారణమవుతాయి. తొలకరి వర్షాలకు పెరిగిన లేత గడ్డిని గొర్రెలు అధికంగా తింటాయి. దీంతో పేగుల్లో గాలిలేని వాతావరణం ఏర్పడటం ద్వారా సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది ఈ వ్యాధిని కలిస్తాయి. ఈ వ్యాధి మే నెల చివరి నుంచి జూలై చివరి వరకు ఎక్కువగా కనిపిస్తుంది. నవంబర్, డిసెంబర్ మాసాల్లో కూడా వ్యాపించే అవకాశాలు ఉన్నాయి.

చికిత్స నివారణ..

జీవాల జీర్ణకోశంలో సూక్ష్మజీవుల వ్యాప్తిని అరికట్టేందుకు టెట్రాసైక్లిన్, ఆంఫీసిలిన్, జెంటామైసిన్ వంటి మందులను క్లోరిల్, ఎపిల్ వంటి ఇంజక్షన్‌లను పశువైద్యుని పర్యవేక్షణలో వాడుతుండాలి. ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో వ్యాధినిరోధక టీకాలు (మల్టీకాంపొనెట్, ఈటీ వ్యాక్సిన్)వేయించాలి. రెండో విడతగా అక్టోబర్, నవంబర్ మాసాల్లో వేయించాలి. తొలకరి వర్షాలకు మొలిచి వాడిపోయిన గడ్డిని సాధ్యమైనంత వరకు జీవాలు మేయకుండా కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలి. మేత కోసం వలస వెళ్లే జీవాలకు వలస ప్రాంతాల్లో గల వ్యాధులను బట్టి ముందే వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవడం ద్వారా వ్యాధిని నివారించుకోవచ్చు. జీవాలను ఉదయం కొంచెం ఆలస్యంగా మేతకు తీసుకెళ్లడం, మధ్యాహ్నం కొంతసేపు విశ్రాంతి ఇవ్వడం, సాయంత్రం త్వరగా ఇంటికి తీసుకురావడం వల్ల వాటి జీర్ణాశయంలో కొంత ఖాళీ ఏర్పడి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందకుండా చూడవచ్చు.

వ్యాధి లక్షణాలు..

ఎలాంటి రోగ లక్షణాలు కనిపించకుండానే ఉన్నట్లుండి జీవాలు చనిపోతాయి. చనిపోయే ముందు గొర్రెలు, మేకులు నీరసంగా ఉండటం గమనించవచ్చు. జీవాలు గాలిలోకి ఎగిరి కిందపడి కాళ్లు గిలగిల కొట్టుకుంటూ పళ్లు కొరుకుతూ వణుకుతూ బిగుసుకపోయి నిమిషాల్లో చనిపోతాయి. కొన్ని జీవాలు నోటి నుంచి నురుగు, చొంగ కారుస్తాయి. శ్వాస పీల్చే శాతం ఎక్కువగా కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో మలబద్ధకం, కడుపు ఉబ్బరం ఉంటుంది. మేత మేయకుండా, నెమరు వేయకుండా తలల వాల్చి, ముడుచుకుని ఒకే చోట నిలబడతాయి. ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువగా ఉదయం, సాయంత్రం వేళల్లో కనిపిస్తుంటాయి.